క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీకి సన్మానం



నెమలిదిన్నె చెన్నారెడ్డిని సన్మానిస్తున్న కంభం మండల నాయకులు

కంభం: వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా నియమితులైన నెమలిదిన్నె చెన్నారెడ్డిని సోమవారం కంభం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకుడిని గుర్తించి రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

మండల సరిహద్దుల వద్ద బోర్డుల ఏర్పాటు



సరిహద్దు బోర్డులు పాతిస్తున్న ఎస్సై నాగరాజు

కొమరోలు: మండల సరిహద్దు తెలియజేసే బోర్డులను కొమరోలు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కడప – ప్రకాశం జిల్లాల బార్డర్‌లోని తిమ్మారెడ్డిపల్లె గ్రామం వద్ద, అమరావతి–అనంతపురం జాతీయ రహదారిలోని ముత్రాసుపల్లె గ్రామం వద్ద అలసందలపల్లె సమీపంలో హైవేపై బోర్డులను పాతించారు. కొమరోలు పోలీసుస్టేషన్ పరిధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండేందుకు బోర్డులు ఏర్పాటు చేయించినట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈలో 'ఆల్ఫా' పూర్వ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంభం: ఆల్ఫా హైస్కూల్లో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ రితీష్ నాయర్ హర్షం వ్యక్తం చేశారు. ఆలిండియా స్థాయిలో ప్రకటించిన ఫలితాల్లో ఎం.రవించంద్ర ఆలిండియా 8వ ర్యాంక్, బీఏ అగస్టిన్ ఆలిండియా 3,282వ ర్యాంక్, ఎస్.ఇంద్రసేనారెడ్డి ఆలిండియా 3,292వ ర్యాంక్, జె. నరేంద్ర ఆలిండియా 5,941వ ర్యాంక్ సాధించిన సందర్భంగా సోమవారం ఆల్ఫా హైస్కూల్లో ఘనంగా సత్కరించి అభినందించారు.



కొనకనమిట్ల : వెన్నుపోటు దినం వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉడుముల, నాయకులు



తర్లుపాడులో..

హామీల అమలులో కూటమి విఫలం

- అన్ని వర్గాల ప్రజలను నమ్మించి నట్టేట ముంచారు
- జూన్ 4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి
- పార్టీ శ్రేణులు, ప్రజలకు వైఎస్సార్ సీపీ నేతల పిలుపు
- బేస్తవారిపేటలో వెన్నుపోటు దినం : మాజీ ఎమ్మెల్యే కేపీ



మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి జూన్ 4వ తేదీకి ఏడాది పూర్తవుతున్నా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి, గెలిచాక పథకాలు అమలు చేయకుండా సంక్షేమాన్ని గాలికొదిలేశారని మండిపడ్డారు. మహిళలను, రైతులను, యువతను, విద్యార్థులను మోసం చేసిన ప్రభుత్వానికి కళ్లు తెరిపించాల్సిన అవసరం ఉందన్నారు. హామీల అమలు కూటమి ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బేస్తవారిపేటలో నిర్వహించనున్న గిద్దలూరు నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

సాక్షి నెట్‌వర్క్: గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తున్నా కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారని దుయ్యబట్టారు. పాలన చేతగాక, పథకాలు అమలు చేయలేక ఖజానా ఖాళీగా ఉందని ముఖ్యమంత్రితో సహా మంత్రులు చెప్పడాన్ని ఆక్షేపించారు. సంపద సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. గద్దెనెక్కినప్పటి నుంచి ప్రతి నెలా అప్పు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఏడాది వ్యవధిలో లక్షా ముప్పై వేల కోట్ల రూపాయల అప్పు చేయడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమమన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పులు పెరిగిపోయాయని దుష్ప్రచారం చేసిన వారు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా తప్పించుకునేందుకు కూటమి నాయకులు ఆడుతున్న డ్రామాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ప్రజలతోపాటు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెన్నుపోటు దినం కార్యక్రమ వాల్‌పోస్టర్లను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు.

కొనకనమిట్ల మండలం చినారికట్లలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి, పొదిలిలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, తర్లుపాడులో మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, కంభంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి, రాచర్లలో పార్టీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, జెడ్పీటీసీ పగడాల దేవి, అర్ధవీడులో మండల అధ్యక్షుడు ఏరువ రంగారెడ్డి, గిద్దలూరులో పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బి.ఓబులరావు, నగర అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, కొమరోలులో జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, మండల అధ్యక్షుడు మేరిగ రవికుమార్ తదితరులు పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్నారు.



గిద్దలూరులో..



కంభంలో..



పొదిలిలో..



రాచర్లలో



కొమరోలులో..

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న సీఐ సురేష్

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని స్థానిక సీఐ కె.సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేంత వరకు శ్రమించాలని సూచించారు. ప్రధానంగా తల్లిదండ్రులు, గురువులపై వినయవిధేయలతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యయాదవ్, యువప్రగతి సంస్థ అధ్యక్షుడు ఫరూక్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, డీఎం నరసింహులు

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మార్కాపురం బస్టాండ్‌ను ఆయన డిపో మేనేజర్ నరసింహులుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్‌లో తినుబండారాలు, టీ, కాఫీలాంటివి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు సూచించారు. త్వరలో కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో కొత్త నియామకాలు లేకపోవడంతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రతి డిపోలో వారంలో ఒకరోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. కరోనా వ్యాపిస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని చెప్పారు. బస్టాండ్లలో కాంట్రాక్టు తీసుకున్న వారు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయనను ప్రయాణికుల సంఘం నాయకులు ఓఎ మల్లిక్, ఆర్‌కేజే నరసింహం కలిశారు. బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

గ్రామస్థాయిలోకి పార్టీని తీసుకెళ్లాలి

మార్కాపురం: క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కుమారస్వామి, జాతీయ కార్యదర్శి ఎస్.సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని వివేకానంద విద్యాపీఠంలో జిల్లా కిసాన్ మోర్చ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో కిసాన్ మోర్చా కమిటీలు ఏర్పాటుచేయాలని సూచించారు. బీజెపి జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, పార్టీ నాయకులు శాసనాల సరోజిని, పీవీ కృష్ణారావు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమారస్వామి

పేదలకు నివేశన స్థలాలివ్వాలి

బేస్తవారిపేట: పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వి.జోసఫ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. భూమిలేని నిరుపేదలకు వ్యవసాయ భూమి పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ఆలయాల్లో 'అన్నా' ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న అన్నా రాంబాబు

మార్కాపురం: మండలంలోని రాయవరం, బొడిచర్ల గ్రామాల్లో ప్రత్యేక పూజల్లో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి పాల్గొన్నారు. రాయవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన రాములవారి ఆలయ ధ్వజస్థంభ ప్రతిష్ఠ ఉత్సవంలో ఇరువురు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మండలంలోని బొడిచర్ల గ్రామంలో నిర్వహించిన నాగారపు ఎల్లమ్మ కొలుపుల ఉత్సవంలో అన్నా రాంబాబుతోపాటు ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషేర్ ఆలీ బేగ్, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నాను నిర్వాహకులు సన్మానించారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘ గిద్దలూరు తాలుకా అధ్యక్షుడు వై.పి.రంగయ్య కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం రాష్ట్ర కౌన్సిల్ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని లయోలా కాలేజీ ప్రాంగణంలో మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ నాయకులు షేక్.సందాని, అరిగెల వెంకటరామయ్య, శంకుల అల్లూరయ్య, నారాయణ, నాగేంద్ర, అచ్చయ్య, టి.సుధీర్, షేక్.మదార్‌వలిఖాజా, జాకీర్‌హుస్సేన్, హిమాంబి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ 6 హామీలు అమలు చేయాలి



కంభంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలు అమలు చేయాలని సీపీఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు అందె నాసరయ్య మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెటూరులో 3 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. పట్టణాల్లో నిర్మించిన టిడ్కో భవనాలను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. మార్కాపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్రాన్, సీపీఐ నాయకులు ఖాశిం, షేక్ హుస్సేన్, రెహనాబా తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలివ్వాలి



ధర్నాలో పాల్గొన్న సీపీఐ, కాంగ్రెస్ నాయకులు

కంభం: అర్హులైన పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, అర్హులైన పేదలకు సాగు భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వి.కిరణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జోసఫ్, సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి

మార్కాపురం టౌన్: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ అశోక్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కోడి రామ్మూర్తి క్రీడా శిక్షణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ తరగతుల ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడా శిబిరాలకు పంపాలన్నారు. శాప్ బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు, సంఘంవ్యవస్థాపక కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు మాట్లాడుతూ.. క్రీడా కోటాలో 3 శాతం రిజర్వేషన్ ఉందని, విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి చూపాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏకపాత్ర, కర్రసాము తదితర క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి అబ్బురపరిచారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవరావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆసక్తిగల రంగాల్లో ప్రతిభ చాటాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: విద్యార్థులు ఆసక్తి గల రంగాల్లో ప్రతిభ చాటాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థుల్లో పఠనాభిలాష పెంచేందుకు, సృజనాత్మక శక్తిని ప్రోత్సహించేందుకు విజ్ఞాన శిబిరాలు ఎంతో దోహదపడతాయని లైబ్రేరియన్ పేర్కొన్నారు. చెస్, క్యారమ్స్, ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

కార్డుదారులకు చుక్కలు



కొమరోలు : రెడ్డిచెర్లలో రేషన్ దుకాణం 7 వద్ద పక్క గ్రామాల లబ్ధిదారులు




బైక్‌పై బియ్యం మూటలు పెట్టుకుని అవస్థలు



గొట్లగట్టులో బియ్యం మోసుకెళ్తున్న మహిళ

బేస్తవారిపేట/కొమరోలు/కొనకనమిట్ల: రేషన్ దుకాణాల్లో సర్వర్ సమస్య కార్డుదారులకు నరకం చూపిస్తోంది. ఎండీయూ వాహనాలతో రేషన్ సరుకుల పంపిణీని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం.. సర్వర్ సమస్యను పరిష్కరించకపోవడంతో రెండో రోజు సోమవారం కూడా లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. బియ్యం కోసం వచ్చిన వృద్ధులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. కిలోమీటర్ల మేర నడిచి షాపుల వద్దకు వెళ్లినా సర్వర్ రావడం లేదని డీలర్లు చెబుతుండటంతో అక్కడే వేచి ఉండలేక, తిరిగి ఇంటికి వెళ్లలేక సతమతమవుతున్నారు.



రెడ్డిచెర్ల నుంచి బియ్యం మోసుకెళ్తున్న వృద్ధురాలు



బేస్తవారిపేటలో సర్వర్ పనిచేయకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్న వృద్ధురాలు

రేషన్ షాపు ఉంది.. కార్డుదారులు లేరు

కొమరోలు మండలం రెడ్డిచెర్లలో 6, 7వ నంబర్ రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆరో నంబర్ దుకాణంలో రెడ్డిచెర్లకు చెందిన లబ్ధిదారులకు సరుకులు ఇస్తున్నారు. 7వ నంబర్ దుకాణంలో రెడ్డిచెర్లకు చెందిన వారు ఎవరూ లేరు. రెడ్డిచెర్ల నుంచి 5 కి.మీ దూరంలో ఉన్న పోసుపల్లె గ్రామానికి చెందిన 110 మంది లబ్ధిదారులు, 2 కి.మీ దూరంలో ఉన్న మల్లారెడ్డిపల్లెకు చెందిన 115 మంది లబ్ధిదారులు, 2 కి.మీ దూరంలో ఉన్న మూలపల్లెకు చెందిన 125 మంది కార్డుదారులను 7వ నంబర్ దుకాణానికి కేటాయించారు. మొత్తం 350 మంది కార్డుదారులు వ్యయప్రయాసలకోర్చి రెడ్డిచెర్ల వెళ్లి సరుకులు తెచ్చుకోలేక యాతనకు గురవుతున్నారు. 7వ నంబర్ దుకాణాన్ని రెడ్డిచెర్లలో తొలగించి మూడు గ్రామాల్లో ఎక్కడో ఒక చోట ఏర్పాటు చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే బాగుంది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసిన పద్ధతి బాగుంది. ఈ నెల నుంచి రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకోలేక అందరూ ఇబ్బంది పడుతున్నారు. మా గ్రామం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న రెడ్డిచెర్లకు కాలినడకన వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. కనీసం మా ఊరిలో రేషన్ షాపు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– షేక్ హుస్సేన్‌బీ, మల్లారెడ్డిపల్లె

ప్రజలకు మళ్లీ కష్టాలే..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా మొదటి వారంలో ఇళ్ల వద్దకు వచ్చి సరుకులు ఇచ్చారు. ఈ పద్ధతి వల్ల వయసుమళ్లిన వారు, ఆరోగ్యం బాగలేని వారు, మహిళలు ఇబ్బంది లేకుండా ఇంటి వద్ద సరుకులు తీసుకున్నారు. ఇప్పుడు ఎండీయూ వాహనాలను రద్దు చేసి అందరికీ కష్టాలు తెచ్చిపెట్టారు.

– గుంటక నారాయణ, పాతపాడు